గురుకుల పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచిన విషయం తెలిసిందే. అందులో భాగంగా విద్యార్థులకు ఏ రోజు ఏమేం ఆహార పదార్థాలు(మెనూ) అందించాలో నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ఆదివారం పలు గురుకుల, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను సందర్శించింది. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని పరిశీలించింది. అన్ని చోట్లా మెనూ ప్రకారం భోజనం పెట్టడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఉదయం పూరి..

మధ్యాహ్నం మటన్

- గురుకులాల్లో మెనూ అమలు భేష్
- పలు పాఠశాలలను పరిశీలించిన 'ఆంధ్రజ్యోతి'
- మూడో ఆదివారం టిఫిన్ చోలె మసాల, పూరి.. లంచ్ బగార అన్నం, మటన్ కర్రీ
- నాణ్యమైన భోజనం పెడుతున్నారన్న విద్యార్థులు
- డైట్ చార్జీలు 40 శాతం.. కాస్మెటిక్ చార్జీలు 100 శాతం పెంపుదలపై హర్షం



కోయిలకొండ గురుకులంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



బగార అన్నం, మటన్ కర్రీ

కోయిలకొండ/అయిజ టౌన్/బిజినేపల్లి/మరికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గురుకులాలు, హాస్టళ్ల డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. ఎన్నడూ లేనంతగా డైట్ చార్జీలు 40 శాతం పెంచగా, కాస్మెటిక్ చార్జీలు 100 శాతం పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు గురుకుల పాఠశాలలను మెనూ అమలు తీరుపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. నారాయణపేట జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని బీసీ గురుకుల ఆశ్రమ పాఠశాలను 'ఆంధ్రజ్యోతి' సందర్శంగా 223 మంది విద్యార్థులు ఉన్నారు. మెనూ ప్రకారం ఉదయం ఉదయం 8:30 గంటలకు పూరి, చోలె మాసాల కూర అందించారు. మధ్యాహ్నం బగార అన్నం, మటన్ కూర, మిల్‌మేకర్ కూర, సాంబర్, పెరుగు వడ్డించారు. పెంచిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ.150 అందిస్తుండగా, ఇప్పుడు రూ.200 అందుతున్నాయని చెప్పారు. కొత్త

(మిగతా 6లో..)

నాణ్యమైన భోజనం అందుతోంది



పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. మటన్, చికెన్, ఎగ్ బజ్జీలతో పాటు వివిధ రకాల టిఫిన్‌లు అందిస్తున్నారు. మూడో ఆదివారం సందర్భంగా బిర్యాని, మటన్, పెరుగుతో భోజనం అందించారు.

- విష్ణుతేజ, ఏడో తరగతి, కోయిలకొండ బీసీ గురుకుల పాఠశాల

ధ్యానం కొనుగోళ్లు

చివరి దశకు

- 3.52 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం
- ఇప్పటి వరకు 71,604 మెట్రిక్ టన్నులు కొనుగోలు
- రైతులకు రూ.124 కోట్లు చెల్లింపులు
- రూ.2,320 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
- చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయం



నారాయణపేట మండలం సింగారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బస్తాలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న హమాలీలు

నారాయణపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్నాయి. పది శాతం మాత్రమే పంటలు కోయాల్సి ఉంది. జిల్లాలో 1,27,485 ఎకరాల్లో వరి సాగు చేయగా, 3.52 లక్షల మెట్రిక్ టన్నుల ధ్యాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 7,804 మంది రైతుల నుంచి 71,604 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు కోసం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 102 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రేడ్ 'ఏ' రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, గ్రేడ్ 'సీ'కి రూ.2,300 మద్దతు ధర చెల్లించారు. దాంతో పాటు తొలిసారిగా ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించింది. ధాన్యం ఆరబెట్టుకునేందుకు కూలీల ఖర్చుతో పాటు ఇబ్బంది ఉన్న రైతులు పచ్చి ధాన్యాన్నే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. మార్కెట్‌లో క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.2,820, ఉండగా కనిష్ఠంగా రూ.1,439, రమారమిగా రూ.2,703 ధర పలికింది. ప్రైవేటుగా కూడా ధర ఆశాజనకంగా ఉండటం, బోనస్‌కు నిబంధనలు విధించడంతో చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విక్రయించారు. దాంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు తగ్గాయి.



గుండుమాల్ మండలం కొమ్మూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్(ఫైల్)

రూ.124 కోట్లు రైతులకు చెల్లింపు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 71,604 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 7,804 మంది రైతులకు రూ.124 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఇంకా రూ.13 కోట్లు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ధాన్యం విక్రయించి నాలుగు రోజులకే నగదు జమ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యంలో సన్న రకం ధాన్యం 57 వేల క్వింటాళ్లు కాగా, దొడ్డు రకం ధాన్యం 14 వేల క్వింటాళ్లు ఉన్నాయి. 92.84 శాతం మేర రైతులకు చెల్లింపులు జరిగాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని ఆరు బాయిల్డ్ రైస్ మిల్లులు, 38 రా రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతీ గింజను కొంటాం



జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతీ వరి గింజను ప్రభుత్వ పరంగా కొనుగోలు చేస్తాం. ఇప్పటి వరకు 7,804 మంది రైతుల నుంచి 71,604 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రైతులకు రూ.124 కోట్లు చెల్లించాం.

- దేవదాస్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, నారాయణపేట

గ్యాస్ సిలిండర్ పేలి యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం



నారాయణ (ఫైల్)

మద్దూర్/కోస్గి రూరల్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ పేలి ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాంలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుండుమాల్ గ్రామానికి చెందిన నారాయణ అలియాస్ నరేశ్ (22), కృష్ణయ్య మహబూబ్‌నగర్ జిల్లా అభంగపట్నానికి చెందిన నవీన్‌లు శనివారం అర్ధరాత్రి మద్దూర్‌లోని రావులపల్లి మార్గంలోని సిద్ధివినాయక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో సాధరణ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్ నింపుతుండగా, అది ఒక్క సారిగా పేలిపోయింది. ప్రమాదంలో నారాయణ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణయ్య, నవీన్‌లను మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో 40 శాతం గాయపడిన నవీన్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. సంఘటనపై సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. చింతకింది వెంకటేశ్ అనే వ్యక్తి సాధారణ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లలో గ్యాస్ నింపించి, హైదరాబాద్‌లోని హోటల్లో విక్రయిస్తున్నాడు. అందుకోసం నారాయణ, కృష్ణయ్య, నవీన్‌లను పనిలో పెట్టుకున్నాడు. వారు సిలిండర్‌ను రీఫిల్లింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. అనధికారికంగా సిలిండర్లు రీ ఫిల్లింగ్ చేస్తున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆభరణాల చోరీ

నాగర్‌కర్నూల్ జిల్లా మంగనూర్‌లో ఘటన

చోరీకి గురైన సొత్తు విలువ రూ.రెండు లక్షలు

7

తల్లీ కొడుకులపై దాడి

బోయిన్‌పల్లిలో ఘటన

7

కొమ్మకొమ్మకో పక్షి



సర్కారు కంపచెట్లపై వాలిన గోరింకలు



ఎగిరిపోతున్న పక్షులు



చెట్లపై వాలిన కొంగలు

సాయం సంధ్య వేళ పక్షులన్నీ చెట్లపై వాలాయి. కొమ్మకొమ్మపై ఒక పక్షి వాలి, కబుర్లు చెప్పుకున్నాయి. గువ్వలు, గోరింకలు, కొంగలు గుమిగూడి చేసిన సవ్వడి వీనుల విందు చేసింది. వనపర్తి మండలం చిట్యాల నుంచి చిమనగుంటపల్లి వెళ్లే దారిలో కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' ఆదివారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

విద్య, ఉపాధికి స్వర్ణయుగం

- ఎమ్మెల్యే యెన్నం ● క్రిస్టియన్‌పల్లి గురుకుల పాఠశాలలో శ్రమదానం



గురుకుల పాఠశాల ఆవరణలో శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరుకు ఎన్నో విద్యాసంస్థలు రాబోతున్నాయని, రానున్న నాలుగేళ్ల కాలం పాలమూరు విద్య, ఉపాధికి స్వర్ణయుగమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చనున్నట్లు చెప్పారు. ఆదివారం ఆయన మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి క్రిస్టియన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉన్న వసతులు, బాత్‌రూమ్, కిచెన్‌షెడ్, విద్యార్థుల గదులను పరిశీలించారు. సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రమదానం చేశారు. పరిసరాలలో ఉన్న పొదలు, ఇతర మొక్కలను తొలగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వసతిగృహంలో అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. నాణ్యమైన భోజనం అందిస్తామని, విద్యార్థులు లక్ష్యం వైపు దృష్టి సారించి కష్టపడి చదవాలని కోరారు. డిగ్రీ, పీజీలలో కష్టపడి చదివితే జీవితంలో స్థిరపడతారన్నారు. చదువుకోవాల్సిన సమయంలో సమయాన్ని వృథా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయన్నారు. ఎప్పటికప్పుడు హాస్టల్‌ను సందర్శించి మీ సమస్యలను పరిష్కరిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల లిస్టు ఇవ్వాలని వార్డెన్‌కు సూచించారు. ఒక కుటుంబం కోసం తెలంగాణ తెచ్చుకోలేదని, మీ భవిష్యత్తు కోసం రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అలీ, నాయకులు సిరాజ్‌ఖాద్రి, రాజు, ఖాషాపాష, అజ్మత్అలీ, ఫయాజ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కాచిగూడ టు పుదుచ్చేరి రైలులో పొగలు

గద్వాల రైల్వే స్టేషన్లో నిలిపివేత

ప్రయాణికులను దించేసిన సిబ్బంది

బీ-4 కోచ్ కింద రబ్బర్లు కాలడం వల్లే పొగలు

7

అండర్-19 వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలు ప్రారంభం

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

7

దారి దోపిడీ పార్థీ గ్యాంగ్ పనే

- నలుగురు నిందితుల పట్టివేత, పరారీలో మరో ఇద్దరు..
- రూ.7 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ, పక్కన ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్ ,డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఈ నెల 18వ తేదీ బుధవారం తెల్లవారు జామున దారి దొపిడీకి పాల్పడింది పార్థీ గ్యాంగ్ పనే అని మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. వనపర్తి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన జగిత్యాల జిల్లా కూజన్ కొత్తూరు గ్రామానికి చెందిన ఎనిమిది మంది ఒకే కుటుంబానికి చెందిన వారు తీర్థయాత్ర ముగించుకుని పెబ్బేరు జాతీయ రహదారి మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో డ్రైవర్ సంతోష్ కు నిద్ర రావడంతో భారీ వాహనాలు నిలిపే స్థలంలో కారు పార్కింగ్ చేసి పడుకున్నారు. 2.50 గంటల సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు వచ్చి కారుపై ఉన్న లగేజీ బ్యాగులను పక్కనే ఉన్న పొలాల్లోకి తీసుకువెళ్లి చూడగా వాటిలో ప్రసాదాలు, బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో వారు మళ్లీ కారు దగ్గరికి వచ్చారు. కత్తులు, రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేసి, మహిళల నుంచి పుస్తెలతాడులు, బంగారు ఆభరణాలను లాక్కున్నారు. ఆ తర్వాత కారు తాళాలు తీసుకుని పారిపోతుంటే డ్రైవర్ సంతోష్ వెంటపడటంతో అతడిని పిడిగుద్దులతో చితక్కొట్టినట్లు తెలిపారు. ఆ తరువాత పక్కనే నిలిపి ఉన్న రెండు చెరుకు ట్రాక్టర్లపై ఎక్కి పారిపోయారు. ఈ విషయాన్ని బాధితులు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురాగా, ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలించి, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పార్థీ గ్యాంగ్‌కు చెందిన వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. దోపిడీలో పార్థీ గ్యాంగ్ మహరాష్ట్రకు చెందిన ఆరుగురు నిందితులు బద్రి గజనాన్ పింపలే, శ్రీరామ్ శివాజీ షిండే, సచిన్ సంతోష్ షిండే, సయ్యద్ ఫిరోజ్ మహేతబ్, సంతోష్ పాండు రంగు కాలే, సంజయ్ పవార్ ఉన్నట్లు మల్టీజోన్ 2 ఐజీ తెలిపారు. వారిలో సంతోష్ పాండురంగు కాలే, సంజయ్ పవార్ పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు ఏడు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు.

శ్రీధర్ రెడ్డి హత్య కేసు విచారణ 95 శాతం పూర్తి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య కేసుకు సంబంధించి కేసు విచారణ 95 శాతం పూర్తి అయ్యిందని ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఈ కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడంతో డీజీపీ ఆదేశాల మేరకు సీఐడి డీజీపీ షియా గోయంక ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 52 మందిని ఇంటరాగేషన్ చేశామని, మరో ఐదుగురు అనారోగ్యానికి గురైన వారు ఉన్నారని తెలిపారు. గ్రామ ఆధిపత్యంతో పాటు వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగిందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని గుజరాత్‌లో ఉన్న నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల సమక్షంలో పాలిగ్రాఫ్ టెస్టు అవ్వగానే నిందితులను గుర్తించి, నెల రోజుల్లో రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. అంతకుముందు దారి దోపిడీ కేసులో నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందికి ఐజీ రివార్డులు అందజేశారు.

ఉదయం పూరి.. మధ్యాహ్నం మటన్



అయిజలోని సంక్షేమ వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

(మొదట పేజీ తరువాయి)

మెనూ అమలు చేస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో ఉగ్గాని, చికెన్

అయిజలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు రెండు ఉన్నాయి. ఇక్కడ 204 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు ఆదివారం ఉదయం రాగిమాల్ట్, చిట్లపొడితో ఉగ్గాని, మధ్యాహ్నం చికెన్, బగారా అన్నం వడ్డించారు.

అనుమతించని ఉపాధ్యాయులు

మరికల్ గురుకుల బాలికల పాఠశాలలో భోజనం పరిశీలనకు 'ఆంధ్రజ్యోతి' వెళ్లగా ప్రిన్సిపాల్ నాగమణిమాల సెలవుపై వెళ్లారని చెప్పారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి విధులకు హాజరుకాలేదు. ఉపాధ్యాయులు లోపలికి అనుమతించలేదు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాకపోవడంతో విద్యార్థులను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులను బయట నుంచే పంపించేశారు.

చార్జీలు పెంచడం సంతోషం



హాస్టళ్లలో భోజనం బాగుండాలని సీఎం సారు చార్జీలు పెంచటం చాలా సంతోషం. మాలాంటి పేద వారికి ఇక్కడ ఉచితంగా ప్రతిరోజు రాగిమాల్ట్, వెజ్ రైస్, పల్లిచట్నీ, కిచిడీ, ఉప్మా, టమోట చట్నీ, పులిహోరా, కరివేపాకు అన్నం, జీరారైస్, ఉగ్గాని పెడుతున్నారు. బాగారా, చికెన్, మటన్, తెల్లన్నం, గుడ్డు, పండు, పెరుగు పచ్చడి వడ్డిస్తున్నారు. సాయంత్ర స్నాక్స్ అయితే పల్లిపట్టీలు, బిస్కట్లు, నువ్వుల పట్టీలు, పాయసం ఇస్తున్నారు. రాత్రికి ఆకు కూరల పప్పు, సాంబర్ అన్నం పెడుతున్నారు. గతంలో కంటే ఇప్పుడు భోజనం చాలా బాగుంది.

- శ్రీకర్, 8వ తరగతి, అయిజ సాంఘిక సంక్షేమ హాస్టల్



కోయిలకొండ గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తింటున్న విద్యార్థులు

పెంచిన మెస్ చార్జీలతో నాణ్యమైన ఆహారం



ఆదివారం ఉదయం పూరి, ఆలుకూర్మ, అరటి పండు, మధ్యాహ్నం బగారా రైస్, మటన్ కర్రీ, మిల్‌మేకర్ కర్రీ, సాంబార్, పెరుగుతో భోజనం పెట్టారు. సాయంత్రం అల్లం చాయ్, రాత్రికి అన్నం, బీరకాయ కర్రీ, సాంబార్, మజ్జిగ సిద్ధం చేస్తున్నారు. హాస్టల్‌లో సరైన ఫర్నీచర్, తాగునీటి వసతి లేకపోవడంతో కొంత ఇబ్బంది పడుతున్నాం.

- పి.అన్వేష్, 8వ తరగతి, బాలుర గురుకుల పాఠశాల, బిజినేపల్లి

కడుపు నిండా వడ్డిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం గురుకులాకు మెస్ చార్జీలు 40 శాతం పెంచింది. మెనూ ప్రకారం విద్యార్థుల కడుపునిండా భోజనం వడ్డిస్తున్నాం. అంతకు మెదు చార్జీలు చాలక మెనూ ప్రకారం భోజనం పెట్టలేకపోయాం. భోజనం వడ్డించేటప్పుడు ప్రిన్సిపాల్ సుమతి పరిశీలిస్తారు. మెస్ చార్జీలు పెంపుతో విద్యార్థులకు సీజనల్ పండ్లు, గుడ్లు, వారంలో రెండు సార్లు మటన్, నాలుగు సార్లు చికెన్ వడ్డిస్తున్నాం. ఆకు కూరలు, కూరగాయలు, స్నాక్స్ క్రమం తప్పకుండా ఇస్తున్నాం.

- జ్యోతి, వంట ఏజెన్సీ సభ్యురాలు, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, బిజినేపల్లి

అయిదు నెలలుగా జీతాలు రాలేదు

నేను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వంట మనిషిగా పనిచేస్తున్నాను. ఆగస్టు నుంచి జీతం ఇవ్వడం లేదు. కుటుంబం గడవటం ఇబ్బందిగా ఉంది. మాకు రెగ్యులర్‌గా జీతాలు అందించాలి.

- భీమేష్, వంట మనిషి, సాంఘిక సంక్షేమ వసతి గృహం, అయిజ

కాస్మెటిక్ చార్జీలు పెరిగాయి



పాఠశాలలో గతంలో కాస్మెటిక్ చార్జీలు నెలకు రూ.150 ఇచ్చేవారు. ప్రసుత్తం ప్రభుత్వం రూ.50 పెంచి రూ.200 ఇస్తోంది. పెంచిన డబ్బులతో మా అవసరాలకు తగిన వస్తువులను కొంటున్నాం.

- శివ, తొమ్మిదో తరగతి, కోయిలకొండ బీసీ గురుకుల పాఠశాల

పాత ధరలే వర్తిస్తున్నాయి

ప్రభుత్వం గురుకులాలకు పెంచిన మెనూ డబ్బులు మాకు వర్తించడం లేదు. ఈ సంవత్సరం టెండర్ ప్రకారమే డబ్బులు అందుతున్నాయి. అయినా ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ అమలు చేస్తున్నాం. వచ్చే సంవత్సరం నుంచి ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయి. ధరలు ఎక్కువైనా నష్టాన్ని భరిస్తూ, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం.

- లక్ష్మీకాంత్‌రెడ్డి, టెండర్ నిర్వహకులు, కోయిలకొండ బీసీ గురుకుల పాఠశాల

భోజనం చాలా బాగుంది..



మాది చాలా పేద కుటుంబం. నేను అయిజలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఉంటూ పదవ తరగతి చదువుతున్నాను. ఆదివారం ఉదయం మా హాస్టల్‌లో రాగీ జావా, ఉగ్గాని, చిట్లపొడి పెట్టారు. మధ్యాహం చికెన్, బాగారా వడ్డించారు. రాత్రికి ఆకుకూర పప్పు, అన్నం, సాంబరు ఉంటుంది. మిగతా రోజుల్లో కూడా మెనూలో ఉన్న ప్రకారమే మాకు భోజనం అందిస్తారు. గతంలో ఇంత నాణ్యతగా ఉండేది కాదు.

- కృష్ణ, 10వ తరగతి, అయిజ సాంఘిక సంక్షేమ హాస్టల్

రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరిన నారాయణపేట జిల్లా కబడ్డీ జట్టు



రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న కబడ్డీ జట్టుతో ఉపాధ్యాయులు

నారాయణపేట టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవలనే నారాయణపేట జిల్లాలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు పూర్తి అయ్యాయి. జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు నారాయణపేట జిల్లాకు చెందిన కబడ్డీ జట్టు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జూనియర్స్ బాలికల కబడ్డీ జట్టు క్రీడాకారులు టోర్నమెంట్‌కు బయలుదేరినట్లు ఆర్గనైజ్ సెక్రటరీ వెంకటప్ప, తిరుపతిరెడ్డి తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు మీనాకుమారి, రేణుక, భీంరెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చిరుత పంజా

నందిపాడ్ పరిసర ప్రాంతాల్లో మూగజీవాలు మృత్యువాత

రెండు రోజుల క్రితం ఘటన

మంద పక్కనే నిద్రించిన కాపరి చంద్రప్పకు తప్పిన అపాయం



నందిపాడ్‌లో చిరుత దాడిలో మృతి చెందిన మేక

మద్దూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో మళ్లీ చిరుత పంజా విసిరింది. నందిపాడ్, మల్కిజాదరావుపల్లిలో చిరుతల సంచారం పాడి రైతుల పాలిట శాపంగా మారింది. శుక్రవారం రాత్రి నందిపాడ్ గ్రామ శివారులో గల గంగప్ప మేకల మందపై రెండు మార్లు దాడి చేసి రెండు మేకలను బలిగొంది. ఆ మంద పక్కనే గొంగడి కప్పుకొని నిద్రించిన మేకల కాపరి చంద్రప్పకు అపాయం తప్పింది. గతంలోనూ ఈ ప్రాంతాల్లో చిరుతల సంచారంతో రైతులు తమ మూగ జీవాలను కోల్పోవాల్సి వచ్చింది. గత కొద్ది కాలంగా స్థబ్దుగా ఉన్న చిరుత లొల్లి మళ్లీ మొదలైంది. గత వేసవిలో మండలంలోని నందిపాడ్, నందిగామ, మోమినాపూర్, చెన్నరెడ్డిపల్లి పరిసరాల్లో సంచరించిన చిరుతలు వేసవి తాపానికి ఒకటి మృతి చెందగా, మరో చిరుత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కాగా ఓ చిరుత ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన బోన్‌కు చిక్కింది. అయినా మరో రెండు చిరుతలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. అయితే మద్దూర్, గుండేమాల్, కొత్తపల్లి మండలాల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ మూగ జీవాలను వేటాడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ వ్యవసాయ పొలాల దగ్గర పశువులను కట్టివేయడానికి భయపడుతున్నారు. దీంతో పాటు తమ ప్రాణాలకు సైతం ప్రమాదం పొంచి ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చామని, ఆ ప్రాంతాల్లో బోనులు ఏర్పాటు చేసి చిరుతల నుంచి తమను రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ..!

- తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ స్పోర్ట్స్ అడ్వయిజర్ ఏపీ జితేందర్‌రెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతుందని తెలంగాణ ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ స్పోర్ట్స్ అడ్వయిజర్ ఏపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ క్రాస్ కంట్రీ పదో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఉదయం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 541 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. హైదరాబాద్ చౌరస్తా నుంచి ఎంపీడీవో కార్యాలయం ముందు భాగం వరకు మహిళలు, పురుషులు పరుగు పందెం పోటీల్లో బాలురు, మహిళలు, పురుషులు అండర్-20, 18, 16లో 8ఏజ్ గ్రూపులుగా పోటీలు జరిగాయి. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్ అధ్యక్షతన వహించగా తెలంగాణ స్పోర్ట్స్ అడ్వయిజర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు హాజరయ్యారు. విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఏపీ జితేందర్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డిలు మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాకారులను తయారు చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా స్టేడియాలను అభివృద్ధి చేయడంతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీలను సైతం ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. యువత చెడు మార్గంలో నడవకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. సీఎం కప్ పోటీలు అందుకు దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనీలా, సంజీవ్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

రెండు బైకులు ఢీ, ఒకరు మృతి

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కార్పాముల, నాయినోనిపల్లి గ్రామాల మధ్య ఆదివారం రాత్రి ఎదురెదురు గా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడి కక్కడే ప్రాణాలు విడిచాడు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... పెద్ద కార్పాములకు చెందిన బండారు కొండారెడ్డి (52)తన వ్యవసాయం పొలంలో నివాసం ఉంటున్నాడు. రోజు వారీగా పాలను తీసుకొని బైక్ మీద పెద్దకార్పాములకు వచ్చి పోతుండేవాడు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు గ్రామంలోని కొందరి ఇళ్లల్లో పాలు పోసి బైక్‌పై తన పొలం వద్దకు వెళ్తుండగా ఎదురుగా నాయినోనిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువ కులు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఈ సంఘట కొండారెడ్డి అక్కడి కక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాకేష్, రఘును నాగర్‌క ర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే పెద్ద కొత్తపల్లి ఏఎస్ఐ బాలనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ జామ్ కావడంతో రోడ్డు క్లియర్ చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు ఇవ్వలేదని పెద్దకొత్తపల్లి పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక యువకుడు తను గుమ్మడి అచ్చుతారెడ్డి(35)అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ పట్టణంలోని దేశిటిక్యాల చెందిన అచ్చుతారెడ్డి కొంతకాలంగా కడుపు నొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ నెల 7వ తేదీన కడుపు నొప్పితో తీవ్ర బాధపడుతూ తన వ్యవసాయ పొలం దగ్గర మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉండగా చుట్టుపక్కల వారు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స నుంచి డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించా రు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతి తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

టమాటా రైతు విలవిల

మార్కెట్‌లో పడిపోయిన ధరలు



పొలంలో టమాట తెంపుతున్న కూలీలు

టమాటను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

వడ్డేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన టమాట విక్రయానికి మార్కెట్‌కు తీసుకువచ్చే సరికి ధరలు అమాంతం పడిపోతున్నాయి. దీంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. లక్షల పెట్టుబడిపెట్టి టమాట పంట సాగుచేస్తే దిగుబడి బాగానే ఉన్నా ధరలు లేకపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో 149 ఎకరాల్లో టమాట సాగు చేశారు. వడ్డేపల్లి మండలంలో 86 ఎకరాలు సాగు చేశారు. ఎకరాకు 30 నుంచి 50టన్నుల దిగుబడి వచ్చినప్పటికి ధరలు పూర్తిగా పడిపోయాయి. టమాట తెంచిన కూలీలు డబ్బులు కూడా రావడం లేదు. 25 కేజీల బాక్స్ మార్కెట్‌లో రూ.150-200లకు అమ్ముతున్నారు. కనీసం బాక్స్ ధరూ.300ల నుంచి రూ.400లకు వరకు అమ్ముడుదు పోతే గిట్టుబాటు అవుతుందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.60-70వేలు పెట్టుబడి పెట్టామని, ధర ఉంటే ఎకరాకు రూ.2లక్షల దాకా ఆదాయం వచ్చేదని రైతులు చెబుతున్నారు. కొనుగోలు చేసే వ్యాపారులు లాభపడుతున్నా రైతులు మాత్రం నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వమే నిర్ణీత ధర నిర్ణయించి టమాటను కొనుగోలు చేస్తే పెట్టుబడులైనా వస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

మార్కెట్ సౌకర్యం లేదు



కూరగాయలకు నిర్ణీత ధర ప్రకటించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హైదరాబాద్, కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్ల లేక దళారుల చేతుల్లో నష్టపోవాల్సి వస్తుంది. పొలాల దగ్గరనే అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం నిర్ణీత ధర ప్రకటించాలి. 25 కేజీల బాక్స్ రూ.300-400లకు పోతే రైతు బాగుపడుతాడు. వ్యాపారులు మాత్రం కేజీ టమాట 20-30లు అమ్ముతున్నారు.

- వెంకటేష్, రైతు పైపాడు

కూలీ డబ్బులు రావడం లేదు



లక్షల పెట్టుబడి పెట్టి పంట పండించిన్నప్పటికీ ధర లేకపోవటంతో కూలీల ఖర్చులు కూడా రావటం లేదు. పంటను పొలంలో వదలలేక కోత కోస్తున్నాం. ఒక బాక్స్ రూ.150-200లకు అమ్మితే చేతికి ఏమి రావటం లేదు. కూరగాయల సాగులో రైతుకు అన్నివిధాల రైతుకు నష్టమే జరుగుతోంది.

- రామాంజనేయులు, రైతు వడ్డేపల్లి

దారి దోపిడీ పార్థీ గ్యాంగ్ పనే

● వివరాలను వెల్లడించిన మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ

వనపర్తి క్రైం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఈ నెల 18వ తేదీ బుధవారం తెల్లవారు జామున దారి దొపిడీకి పాల్పడింది పార్థీ గ్యాంగ్ పనే అని మల్టీజోన్ 2 ఐజీ సత్య నారాయణ తెలిపారు. వనపర్తి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన జగిత్యాల జిల్లా కూజన్ కొత్తూరు గ్రామానికి చెందిన ఎనిమి ది మంది ఒకే కుటుంబానికి చెందిన వారు తీర్థయాత్ర ముగించుకుని పెబ్బేరు జాతీయ రహదారి మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో డ్రైవర్ సంతోష్‌కు నిద్ర రావడంతో భారీ వాహనాలు నిలిపే స్థలంలో కారు పార్కింగ్ చేసి పడుకున్నా రు. 2.50 గంటల సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు వచ్చి కారు పై ఉన్న లగేజీ బ్యాగులను పక్కనే ఉన్న పొలాల్లోకి తీసుకు వెళ్లి చూడగా వాటిలో ప్రసాదాలు, బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో వారు మళ్లీ కారు దగ్గరికి వచ్చారు. కత్తులు, రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేసి, మహిళల నుంచి పుస్తెల తాడులు, బంగారు ఆభరణాలను లాక్కు న్నారు. ఆ తర్వాత కారు తాళాలు తీసుకుని పారిపోతుంటే డ్రైవర్ సంతోష్ వెంటపడటంతో అతడిని పిడిగుద్దులతో చితక్కొట్టినట్లు తెలిపారు. ఆ తరువాత పక్కనే నిలిపి ఉన్న రెండు చెరుకు ట్రాక్టర్లపై ఎక్కి పారిపోయారు. ఈ విషయాన్ని బా ధితులు వెంటనే పోలీసుల దృష్టికి తీసు కురాగా, ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావులు ఘటన స్థలానికి చేరు కొని పరిశీలించారు. వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలించి, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పార్థీ గ్యాంగ్‌కు చెందిన వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. దోపిడీలో పార్థీ గ్యాంగ్ మహారాష్ట్రకు చెందిన ఆరుగురు నిందితులు బద్రి గజనాన్ పింపలే, శ్రీరా మ్ శివాజీ షిండే, సచిన్ సంతోష్ షిండే, సయ్యద్ ఫిరోజ్ మహేతబ్, సంతోష్ పాండు రంగు కాలే, సంజయ్ పవార్ ఉన్నట్లు మల్టీజోన్ 2 ఐజీ తెలిపారు. వారిలో సంతోష్ పాండురంగు కాలే, సంజయ్ పవార్ పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు ఏడు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు.

శ్రీధర్ రెడ్డి హత్య కేసు విచారణ 95 శాతం పూర్తి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య కేసుకు సంబంధించి కేసు విచారణ 95 శాతం పూర్తి అయ్యిందని ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఈ కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడంతో డీజీపీ ఆదేశాల మేరకు సీఐడి డీజీపీ షియాగోయంక ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 52 మందిని ఇంటరాగేషన్ చేశామని, మరో ఐదుగురు అనారోగ్యానికి గురైన వారు ఉన్నారని తెలిపారు. గ్రామ ఆధిపత్యంతో పాటు వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగిందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐలు కృష్ణయ్య, శివకుమార్, రాంబాబు, ఎస్ఐలు హరిప్రసాద్, యుగంధర్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

ఉండవల్లిలో సైబర్ కేసు నమోదు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఫేస్‌బుక్‌లో వచ్చిన పోస్టుకు లైక్ కొట్టి నగదు పోగొట్టుకున్న ఘటన ఉండవల్లి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఇటిక్యాలపాడు గ్రామానికి చెందిన బోయరాముడు వంట మాస్టారుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఖాళీ సమయంలో ఫేస్‌బుక్ చూస్తూ ఓ పోస్టుకు లైక్ కొట్టాడు. వెంటనే ఓ నెంబరు నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కొంత డబ్బులు జమ చేస్తే లోన్ మంజూరు చేస్తామని నమ్మ బలికారు. ఇది నమ్మిన రాముడు మొదట రూ.రెండు వేలు పంపాడు. ఇలా పలుమార్లు విడతల వారీగా మొత్తం రూ.33వేలు సమర్పించుకున్నాక తేరుకుని ఉండవల్లి పోలీసులను ఆశ్రయించాడు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రెయినీ ఎస్ఐ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోలీసు అధికారుల చొరవతో రూ.23వేలు బదిలీ కాకుండా నిలిపివేశారని బాధితుడు తెలిపారు.

ఒకటికి నాలుగు రెట్లు..



పోలీసుల రంగ ప్రవేశంతో వ్యాపారులు బయటకు వెళ్లడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

గద్వాల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మీ డబ్బులు బ్యాంకులో పెడితే ఏమొస్తది.. అవే మాకు ఇస్తే ఒకటికి నాలుగు రెట్లు.. అది కూడా కేవలం 45 రోజుల్లోనే ఇస్తామని ప్రజలను నమ్మిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం గద్వాల పట్టణంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నిర్వాహకుడిపై సుమోటో కేసు నమోదు చేశారు. సీఐ టంగుటూరి శ్రీను, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని బసవన్న చౌరస్తా సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎల్ఎఫ్ఎల్ ఆర్గనైజేషన్ పేరుతో గద్వాలకు చెందిన ఓ యువకుడు సమావేశం ఏర్పాటు చేయించారు. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం ఎల్ఎఫ్ఎల్ అనే స్విజ్జర్‌లాండ్‌కు చెందిన సంస్థలో ఒక వ్యక్తి రూ. 12 వేలు డిపాజిట్ చేస్తే 45 రోజుల్లో రూ. 48వేలు వస్తాయని నమ్మించి సభ్యులను డిపాజిట్ చేసేలా చేయడమే... అయితే ఇందుకు గద్వాలకు చెందిన ఓ యువకుడు చాలామందికి ఆశ కల్పించి వారిని సభ్యులుగా చేర్పించి డిపాజిట్ కట్టించేలా చేసేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే సీఐ టంగుటూరి శ్రీను ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ట్రైనీ ఎస్ఐ తారక సమావేశం జరుగుతున్న స్థలానికి వెళ్లి విచారించారు. ఇది ప్రజలను మోసం చేసే గొలుసు కట్టు పద్ధతిలో ఉన్నదని, హైదరాబాద్ నుంచి వచ్చిన టీం సభ్యులను విచారించి తర్వాత నిర్వాహకుడిపై సుమోటో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇందులో ఇంకా ఎవరెవరు ఉన్నారనేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

క్రైం కార్నర్

తల్లీకొడుకులపై దాడి

- స్థలం విషయంలో గొడవ
- దాడిచేసిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిడ్జిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణమ్మ, ఆమె కుమారుడు శివలపై సంతోష్ గడ్డపారతో దాడిచేసి గాయపరిచినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణమ్మ, కమలమ్మలకు సంబంధించిన 150 గజాల ప్లాటుకు సంబంధించిన వివాదంలో కొన్ని రోజులుగా గొడవ పడుతున్నట్లు తెలిపారు. స్థల పత్రాలు కృష్ణమ్మ పేరుమీద ఉండటంతో కమలమ్మకు కృష్ణమ్మ రూ. 80వేలను ఇచ్చేటట్లు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇదే విషయంపై ఆదివారం సంతోష్ కృష్ణమ్మ ఇంటికి వెళ్లి తన వెంట తెచ్చుకున్న గడ్డపారతో కృష్ణమ్మపై దాడి చేయగా ఆమెతో పాటు, కుమారుడు శివ తలకు గాయమైనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు వెంటనే పోలీసులను గ్రామానికి పంపించడంతో గొడవ సద్దుమణిగిందని తెలిపారు. దాడికి పాల్పడిన సంతోష్‌ను పోలీసులు తమ వాహనంలో స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు.

బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. గాయపడిన ఇరువురు ప్రస్తుతం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


గణేష్(ఫైల్)

ఉప్పునుంతల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని పూర్యానాయక్‌తండాలో చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూర్య, బిజ్జి దంపతుల రెండో కుమారుడు గణేష్(25) వ్యవసాయ పొలంలో పైప్‌లైన్ మార్చేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగాడు. కుమారుడు రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్న గణేష్‌ను చూసి తల్లిదండ్రులు బోరుమన్నారు. యువకుని మృతికి కారణం ప్రేమ వ్యవహారమే అయి ఉండవచ్చని తెలుస్తున్నది.

చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆభరణాలు చోరీ

బిజినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామంలో గల చౌడేశ్వరీ దేవి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేశారు.


ఆభరణాలు చోరీకి గురైన చౌడేశ్వరీ దేవి ఆలయం

ఈ సంఘటనపై గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు మాసయ్య ఆది వారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు రోజులాగే ఆదివారం ఉదయం ఆటుగా వెళ్లిన గ్రామస్థులు ఆలయం తాళాలు తీసి ఉండటంతో అనుమానం వచ్చి యాదవ సంఘం వారికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయానికి వెళ్లి పరిశీలిం చగా 51 తులాల వెండి కిరీటం, 46 తులాల వెండి గొలుసులు, 10 తులాల వెండి తొట్టె, కండ్లు బొట్టు బిళ్లలు, రెండు మాసాల బంగారు పుస్తెలు, రెండు పట్టు చీరలను దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన మొత్తం సొత్తు విలువ దాదాపు రూ. రెండు లక్షల వరకు ఉంటుందని సంఘం వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై మంగనూర్ యాదవ సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. శ్రీనివాసులు తెలిపారు.

పొలంలో కిందపడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలంలో పనిచేసుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో కిందపడి కావలి కృష్ణయ్య (47) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. బిజినేపల్లి గ్రామానికి చెందిన కావలి కృష్ణయ్య ఈదురు చెరువు సమీపంలోని వ్యవసాయ పొలంలో వరి కోత కోసిన మడిలో ఉన్న గుంతలో ప్రమాదవశాత్తు బోర్లా పడి అపస్మారకంలోకి వెళ్లాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి అతడి భార్య యాదమ్మ, కుమారుడు వంశీకి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో నిరుపేద కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భర్తకు తెలియకుండా భార్య అప్పు చేసింది. తీరా డబ్బులు ఇచ్చిన వ్యక్తి మందలించడంతో భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మధురానగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మధురానగర్ కాలనీకి చెందిన గున్న ముత్యాలు (56) రజిత భార్యాభర్తలు. ముత్యాలు జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్ ఆఫీస్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య కొన్ని రోజులు నర్సు ఉద్యోగం చేసి మానేసింది. రజిత భర్తకు తెలియకుండా రూ.లక్షా 50వేలు ఒక వ్యక్తి దగ్గర అప్పు చేసింది. ఆ వ్యక్తి శనివారం ముత్యాలు ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని నిలదీయడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంటుండగా చుట్టుపక్కల వారు గమనిం చి కిందికి దింపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడ టు పుదుచ్చేరి రైలులో పొగలు

- గద్వాల స్టేషన్లో నిలిపివేత: ప్రయాణికుల దింపివేత


గద్వాల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను క్రిందకి దింపిన అధికారులు

గద్వాల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ నుంచి పుదుచ్చేరికి వెళ్లే రైలులోని ఓ బోగీ కింది భాగంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున పొగలు వచ్చాయి. దీంతో గద్వాల స్టేషన్లో రైలును నిలిపివేసి, సమస్యను గుర్తించి, మరమ్మతు చేశారు. ఇందుకు సంబంధించి రైల్వే అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ నుంచి పుదుచ్చేరికి వెళ్లే రైలు గద్వాల స్టేషన్‌ను సమీపిస్తుండగా, బీ-4 కోచ్ కింది భాగం నుంచి ఒక్కసారిగా పెద్దఎత్తున పొగలు వచ్చాయి. అప్రమత్తమైన రైల్వే అధికారులు స్టేషన్లో రైలును నిలిపివేసి, ప్రయాణికులను కిందికి దించారు. కోచ్ కింది భాగంలో రబ్బర్లు కాలిపోవడం వల్ల పొగలు వచ్చినట్లు గుర్తించారు. వాటిని తొలగించి కొత్తవి వేశారు. ఆ తర్వాత ప్రయాణికులను రైలు ఎక్కించారు. ఈ సంఘటన వల్ల గద్వాల స్టేషన్ నుంచి రాత్రి 7.40 గంటలకు బయలు దేరాల్సిన రైలు రాత్రి 9.05 గంటలకు బయలు దేరిందని రైల్వే ఎలక్ట్రికల్ అధికారి శంకర్ తెలిపారు. రైలు కర్నూల్‌కు చేరుకునే వరకు సిబ్బంది పరిస్థితిని గమనిస్తూ ఉంటారని తెలిపారు.

లెక్కలు పక్కాగా.. అర్థం అయ్యేలా..


● గణితంపై ఆసక్తిని పెంచేందుకు ప్రయోగశాల
ఖిల్లాఘణపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ల్యాబ్‌లో వస్తువులు

- ఖిల్లాఘణపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు
- కృత్యాల ఆధారంగా పాఠ్యాంశాల బోధన ● విద్యార్థుల్లో పెరుగుతున్న సృజనాత్మక శక్తి
- గణిత పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యం

లెక్కలు అంటేనే ఇబ్బంది అనే దాని నుంచి చాలా సులువు అనే పరిస్థితిని కల్పించారిక్కడ.. గణిత ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే పద్ధతిన పలు ఆకృతులు, సూచనలతో ఏర్పాటు చేశారు. గణితం అంటే కష్టం కాదు.. ఇష్టం అంటూ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారంటే ఈ గణిత ల్యాబ్ ద్వారా బోధన ఎలా సాగుతుందో ఊహించుకోవచ్చు. ఈ ల్యాబ్ వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోనిది. మరి అక్కడ ఎలా గణిత బోధన సాగుతుందో ఓ లుక్కేద్దామా..

ఖిల్లాఘణపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇష్టం లేని చదువు కష్టంగా మారుతుందని గణితంపై మక్కువ కల్పించేలా జీవితం ఒక గణిత సమీకరణంగా మార్చాలని మంచి సంకల్పంతో ల్యాబ్ ఏర్పాటుకు బీజం పడింది. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2022 డిసెంబరు 22న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గణిత ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ బడులకు గణిత ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచి ప్రభుత్వ బడుల్లోని విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ల్యాబ్ ఉపయోగకరంగా మారింది. పాఠశాలలోని గణిత ఉపాధ్యాయురాలు శోభారాణి సొంత డబ్బులు వెచ్చించి రూ.2 లక్షలతో ల్యాబ్‌లో పరికరాలు, తరగతి గది గోడల చుట్టూ గణిత విజ్ఞానాన్ని పెంపొందించే సూత్రాలు, విద్యార్థులకు ఆ సబ్జెక్టుపై ఆసక్తి కలిగించేలా వస్తు సముదాయాన్ని ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం కలిగే విధంగా ప్రతీ ఏడాది ల్యాబ్‌లో కొత్త పరికరాలను పెంచడానికి కృషి చేస్తున్నారు.

విద్యార్థులు స్వయంగా వాటిని వినియోగించడం వారికి గుర్తుండిపోయే విధంగా కృత్యాలు చేయిస్తూ గణితంపై భయాన్ని పోగొడుతున్నారు. గణిత శాస్త్రవేత్తల చిత్ర పటాలను ల్యాబ్‌లో ప్రదర్శించి వారి గొప్పతనాన్ని వివరిస్తూ గణిత సబ్జెక్టును ఇష్టపడి చదివే విధంగా విద్యార్థుల్లో మార్పు తెస్తున్నారు. ల్యాబ్‌లోని పరికరాలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడుతున్నాయి. జ్యామితీయ నిరూపణల ఆకారాల ద్వారా విద్యార్థుల్లో గణిత పాఠ్యాంశాలపై అవగాహనతో విద్యార్థుల్లో చెరగని ముద్రగా వేస్తున్నారు. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవాలని గణిత పోటీ పరీక్షలకు ఉపయోగకరంగా మార్చుకొని టాలెంట్ టెస్టుల్లో పాల్గొని ప్రతిభ సాధిస్తున్నారు. ఇండియన్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులో సైతం విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో గణిత, సైన్స్‌కు సంబంధించిన శిక్షణ శిబిరాలకు వెళ్లి కొత్త విషయాలపై పట్టు సాధిస్తున్నారు.


వర్గాలు వర్గమూలాలు తెలిపే వివిధ రకాల గడియారాల నమూనాలు

● గణిత ల్యాబ్‌లోని ప్రత్యేకతలు

విద్యార్థులు సులభంగా వర్గాలు, వర్గమూలాలు, ఘాతాలు, ఘాతాంకాలు, వర్గాలను గుర్తించే విధంగా రకరకాల ఆకారాల్లో గడియార నమూనాలు స్వీయ ఆలోచనతో తయారు చేసి ప్రదర్శించడం. త్రీడీ ఆకారాలు, జ్యామితీయ గణిత నమూనాలు సరూప సర్వ సమాన ఆకారాలు, వృత్తంలో సెక్టర్లు, వృత్త కోణాలు, కోణాలకు సంబంధించిన వివిధ ఆకారాలు, జియో బోర్డు, డై, చతుర్విధ ప్రక్రియలు, సమితిల నమూనాలు, పైథాగరస్ సిద్ధాంతం, త్రికోణమితి, వాస్తవ సంఖ్యలు శ్రేణులు నమూనాలు, ఆటలతో గణితం నేర్చుకునే కార్డులు, సంభావ్యత ఆకారాలు, సంఖ్యలను గుర్తించే చార్టులు ఏర్పాటు చేశారు. తరగతి గోడలపై చుట్టూ గణిత విజ్ఞానాన్ని పెంపొందించే పెయింటింగ్‌లు వేయించారు. ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన గణిత సమాచారం పూర్తిగా లభించే విధంగా ల్యాబ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గణిత విద్యాబోధన దృశ్య రూపకంగా చూపడంతో విద్యార్థి దశలోనే గణితంపై సెమినార్లు నిర్వహి స్తున్నారు.

గణిత ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన ఉపాధ్యాయురాలు శోభారాణికి 2023, సెప్టెంబరు 5న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం విశేషం.

● రెండు సంవత్సరాలుగా గణిత ల్యాబ్‌ను ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీఈవోలు రవీందర్, గోవిందరాజులు ప్రజాప్రతినిధులు అధికారులు సందర్శించి ల్యాబ్ వల్ల విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పలు సలహాలు సూచనలు చేస్తున్నారు. విద్యార్థుల ఉన్నతికి ప్రత్యేకంగా గణిత ల్యాబ్‌లకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మరింత ప్రయోజనకరంగా మారి విద్యార్థులు గణిత సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది.

గణితంపై ఆసక్తిని పెంచడమే లక్ష్యం



విద్యార్థులకు గణిత సబ్జెక్టుపై ఉన్న భయాన్ని పోగొట్టి ఆటపాటల ద్వారా గణితంపై ఆసక్తిని పెంచడమే లక్ష్యంగా మారడంతో గణిత ల్యాబ్ ఏర్పాటు జరిగింది. 2023లో మ్యాథ్స్ ఆర్టికల్ ఎస్ఈఆర్టీకి ఎంపిక కావడంతో పట్టుదల పెరిగి విద్యార్థులు గణిత సంబురాలు చేసుకునే స్థాయికి వెళ్లింది. గణిత ఫోరంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉండటంతో కొత్త విషయాలు నేర్చుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాను. గత పది సంవత్సరాలుగా గణితంకు సంబంధించిన చార్టులను స్వయంగా రాసుకోవడం విద్యార్థుల్లో గణితం స్కిల్స్‌ను పెంచడానికి కృషి చేయడం ఆత్మ సంతృప్తిని కలిగిస్తుంది.

- శోభారాణి, గణిత ఉపాధ్యాయురాలు, బాలికల ఉన్నత పాఠశాల, ఖిల్లాఘణపురం

● గణితంపై పట్టు సాధిస్తున్నాం



గణిత ల్యాబ్‌లో విద్యా బోధన జరగడంతో గణితంపై పట్టు సాధిస్తున్నాం. ప్రతి ఫార్ములాను కళ్లకు కట్టినట్లు చూపుతూ వివరించడంతో గణిత సమస్యలను సులభంగా సాధిస్తున్నాం. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గణిత, సైన్స్ విజ్ఞన కేంద్రాల్లో సృజనాత్మక శక్తితో ప్రతిభ చాటుతూ ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉంది.

- శృతి , 10వ తరగతి , జడ్పీహెచ్ఎస్ , బాలికలు, ఖిల్లాఘణపురం

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలువాలి

- జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్
- రాష్ట్ర స్థాయి పోటీలకు తరలిన జిల్లా బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. మేడ్చల్ జిల్లాలో నేటి నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న బాలికల రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలికల జట్టు తరలివెళ్లింది.

ఆదివారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టును జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయి రాణిస్తున్నారని గుర్తుచేశారు. కబడ్డీలో జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు ఉమామహేశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్, దామోదర్‌రెడ్డి, వేణుగోపాల్, పాపరాయుడు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా బాలికల కబడ్డీ జట్టు

జట్టు వివరాలు..

జిల్లా బాలికల జట్టు: గంగ, మౌనిక, అనూష, పార్వతి, గాయత్రి, నందిని, ఇందు బాయ్, సింధూజ, సంధ్యారాణి, శిరీష, రాణి, సోను.

అండర్-19 వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలు ప్రారంభం

- క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభచాటి గుర్తింపు తేవాలి
- కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కోస్గి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అండర్-19 వాలీబాల్ జాతీయస్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఆదివారం కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి 68వ పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-19 బాలుర విభాగంలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించి విద్యార్థులు దేశానికి, తెలంగాణ రాష్టానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ పోటీలు స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో ప్రారంభం కాగా, ఇందులో 21 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఏడు కేంద్ర పాఠశాల జట్లనుంచి దాదాపుగా 400 మంది క్రీడాకారులు, 100మంది జట్ల కోచ్ మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతీ రాష్ట్రం నుంచి ఈ క్రీడలలో క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారని, అందులో భాగంగానే ఈక్రీడలు కోస్గిలో నిర్వహిస్తున్నారని అన్నారు. మొదట హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ క్రీడను ప్రారంభించారు. ఎస్జీఎఫ్ రాష్ట కార్యదర్శి రామ్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ గరీమానరుల, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, డీఈవో గోవిందరాజులు, తహసీల్దార్ మల్లిఖార్జునరావ్, ఎంపీడీవో శ్రీధర్, కమిషనర్ నాగరాజు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తిరుపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్

మార్షల్ ఆర్ట్సలో రాణించాలి

- ఆలిండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణయ్య


బెల్టులు సాధించిన విద్యార్థులతో ఆలిండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణయ్య

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బాల,బాలికలు మార్షల్ ఆర్ట్సలో రాణించాలని జీకే మాస్టర్ షోటోకాన్ ఆలిండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణయ్య అన్నారు. జీకే మాస్టర్ షోటోకాన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో డైట్ కళాశాల మైదానంలో మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణయ్య బెల్టులు ప్రదానం చేశారు. కరాటే శిక్షణ పొందిన విద్యార్థుల ప్రతిభ ఆధారంగా బెల్టులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కరాటేలో ప్రావీణ్యం సాధించేందుకు మాస్టర్లు మెరుగైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మహిమాస్వితను సన్మానించారు. టోర్నీలో పతకాలు సాధించాలని ఆకాక్షించారు. మాస్టర్లు రవికుమార్, సత్యనారయణ, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ


సీఎం కప్ రాష్ట్ర స్థాయి టోర్నీ పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవలే జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ టోర్నీలో కిక్‌బాక్సింగ్‌లో జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యార్థులు పతకాలు సాధించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి న కార్యక్రమంలో కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ విద్యా ర్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన పలు విభాగంల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ప్రశాంత్, వెంకటకృష్ణయ్య, విజయ్‌కుమార్, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రముఖ భజన కళాకారుడు మృతి


శ్రీనివాసులు (ఫైల్)

తెలకపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కళాకారుడు అతినారపు శ్రీనివాసులు ఆదివారం ఉదయం మృతి చెందారు. భజన కీర్తనలలో ఉద్దండుడిగా మండలంలో పేరు పొందారు. జిల్లాలో, మండలంలో ఎక్కడ భజనలు జరిగినా శ్రీనివాసులు ఉండేవారు. ఆయన గాత్రం అద్భుతంగా ఉండటంతో ఎక్కడ భజన జరిగినా ఆయనను తీసుకొని వెళ్లేవారు. ఎంతోమంది భజన కళాకారులు ఆయన నుంచి ప్రేరణ పొందారు. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో వాలీబాల్ ఆటల్లో పాల్గొని ఉత్తమ ప్లేయర్‌గా మన్ననలు పొందారు. అనారోగ్యం బారిన పడి ఉదయం మృతి చెందారు. ఆయనకు పలువురు కళాకారులు, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ యాదయ్య నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి

- వనపర్తి ప్రభుత్వ కళాశాల స్వర్ణోత్సవాల్లో కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు కూడా భవిష్యత్తులో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవాలు నిర్వహించగా, ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన తెలంగాణ ఎలక్ట్రిసిటీ నియంత్రణ కమిషన్ చైర్మన్ జస్టిస్ దేవరాజుల నాగార్జున, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఇదే కళాశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత స్థాయికి ఎదిగిన ఆర్జేడీ రాజేంద్రసింగ్, గద్వాల అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ సహా పలువురు తమ సహచర పూర్వ విద్యార్థులతో కలిసి హాజరయ్యారు.

కలెక్టర్ ఆదర్శ్ సురభిని కళాశాల పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సమాజంలో బాధ్యత కలిగిన పౌరులం అంటూ సమాజ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి చేర్చిన తమ గురువులకు ఘనంగా సన్మానించారు. కళాశాల స్థాపనకు కీలకమైన వ్యక్తి టైపు కృష్ణయ్య కూతురు సరళను, అప్పటి వనపర్తి ఎమ్మెల్యే జయ రాములు కుమారుడు శ్రీనివాసులును, మరో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాలకృష్ణయ్య కుమార్తె జయంతిలను వేదికపైకి ఆహ్వానించి సన్మానించారు.

● త్వరలోనే డిగ్రీ కళాశాల ఆవరణంలో బాలికలకు బాలురకు వేరు వేరుగా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి హాస్టల్‌ను నిర్మిస్తానని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు.

● కళాశాల మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తామని ఎంపీ మల్లు రవి అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు మరిన్ని నిధులు తీసుకువస్తానని అన్నారు.

● ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తిలో ఉన్న విద్యా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు తపన పడుతున్నారని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. అదే దిశగా మేమంతా ముందడుగు వేస్తూ మరింత బలోపేతం చేస్తామని అన్నారు.

● భావితరాల భవిష్యత్తు కోసం విద్యను అగ్రభాగంలో నిలిపానని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. నా హయాంలో మంజూరు అయిన బీసీ మహిళా కళాశాల, జెఎన్‌టీయూ కళాశాల నిర్మాణాల కోసం మౌలిక వసతుల కల్పన కోసం చిన్నారెడ్డి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి పట్టణం విద్యావ్యాప్తిగా పేరు గాంచిందని చెప్పారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జున మాట్లాడుతూ... పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థిగా తన వంతుగా లక్ష రూపాయల విరాళం ఇస్తున్నానని ప్రకటించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్, సభాధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, మీడియా కమిటీ సమన్వయకర్త మాల్యాల బాలస్వామి, పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావు, ప్రభుత్వ న్యాయవాది కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఇంటర్వ్యూ..

పశు సంపద పెంపే లక్ష్యం

»» పశు వైద్యాధికారి నరేందర్



గండీడ్ , డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పశుసంపద పెంపే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు మండల పశువైద్యాధికారి నరేందర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాను సారం గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలువ విషయాలు వివరించారు.

ఎన్ని పశువులు ఉన్నాయి?

మండలంలో 4,141 పశువులు, 4,370 గేదెలు, 39,705 గొర్రెలు, 8,481 మేకలు ఉన్నాయి.

పశు వైద్యశాలలు, ఉప కేంద్రాలు ఎన్ని ఉన్నాయి?

గండీడ్, బల్సూర్‌గొండ గ్రామాల్లో ప్రాథమిక పశువైద్యశాలలు ఉండగా, వెన్నాచేడ్, పెద్దవార్వల్ గ్రామాల్లో ఉప కేంద్రాలు ఉన్నాయి. గండీడ్, బల్సూర్‌గొండ గ్రామాల్లో భవనాలు ఉండగా, వెన్నాచేడ్‌లో భవనం అసంపూర్తిగా ఉంది. పెద్దవార్వల్ గ్రామంలో భవనం పూర్తి కాగా, ఇంకా ప్రారంభించలేదు.

సిబ్బంది అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి?

ఈ విషయంపై మా దృష్టికి ఫిర్యాదు రాలేదు. అలాంటిది ఉంటే సిబ్బందిపై చర్యలు తప్పవు. ఏమైన ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకరావాలి.

న్యూస్ బాక్స్

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

పాలమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ హాస్టల్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే అందజేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంరాజు, కుర్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ సందర్శించిన ఎమ్మెల్యేకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. జిల్లాలోని ఆరు వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు అందజేయాలని కోరారు. కలెక్టర్, సంబంధిత ఆధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మనోహర్, వేణు, హాస్టల్ వర్కర్స్ పుష్ప, భారతమ్మ, భార్గవి, లక్ష్మి, రోజా రాణి, అనూష, అంజి పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి'

పాలమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎరుకలను ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని ఎరుకల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జమ్ములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎరుకల ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎరుకలు అభివృద్ధి చెందటానికి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. త్వరలోనే జిల్లాలో ఎరుకల మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకుని ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. రాష్ట్ర నాయకుడు లాల్‌కోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన కల్పించాలి

మమబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే చిన్నారులకు భగవద్గీతపై అవగాహన కల్పించాలని ఆధ్యాత్మిక సేవా సంస్థ కన్వీనర్ మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జగదంబ కాలనీ రామాలయ మండపంలో సంస్కార కేంద్రం తరుపున చిన్నారులకు దేశభక్తి, దైవ భక్తి, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక సామాజిక సంస్కృతి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో 100 మంది చిన్నారులు పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రవచన కర్త ప్రణేషచారి, రామచంద్ర రావు, భాస్కర్, నరసింహులు, దేవేందర్ పాల్గొన్నారు.

సర్వేను వేగంగా పూర్తి చేయాలి

భూత్పూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ సూచించారు. ఆదివారం రెవెన్యూ అధికారులతో కలిసి ఇళ్ల సర్వేను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే తీరును అధికారులతో తెలుసుకున్నారు.

కొండచిలువ సంచారం

మూసాపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంకలమద్ది గ్రామ శివారులో పందిగుట్ట నుంచి కొత్తకాల్వ పరిసరాల్లో కొండచిలువ సంచరించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నాలుగైదు రోజుల నుంచి జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డును ఆనుకొని ఉన్న కొత్తకాల్వ, పందిగుట్ట పరిసరాల్లో రెండు వారాల క్రితం ఓ ఆటో డ్రైవర్‌కు కనిపించగా, మరల రెండు రోజుల క్రితం స్థానికులకు కనపడగా ఆందోళన చెందుతున్నారు.

కొనసాగిన ధాన్యం విక్రయాలు

నవాబ్‌పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్‌కు ఆదివారం భారీగా ధాన్యం తరలివచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ కుమార్ తెలిపారు. టెండర్‌లో వరి, మొక్కజొన్న, రాగులు, జొన్నలకు గరిష్ఠ ధరలు చెల్లించినట్లు ఆయన తెలిపారు. వరి ఆర్ఎన్ఆర్ 20906 బస్తాలు రాగా, (8362 క్వింటాళ్లు) క్వింటాలుకు రూ.2,758, వరి 1010 బస్తాలు 1694 (678 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,234, మొక్కజొన్న బస్తాలు 239 (120 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు రూ.2,412, జొన్నలు బస్తాలు 457 (229 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు రూ.7,322, రాగులు 15 బస్తాలు (8 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు రూ.3,801 గరిష్ఠ ధరలు పలికినట్లు తెలిపారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



చర్చిలో కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

యేసు దీవెనలు అందరిపై ఉండాలి

»» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యేసు ప్రభు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంబీసీ చర్చి ప్రాంగణంలో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి, విందును ప్రారంభించారు. ముందుగా చర్చి పాస్టర్ వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, చర్చి ప్రతినిధులు టైటస్ రాజేందర్, జాకోబ్, ఇమ్మాన్యూల్ రాజ్, స్టీఫెన్, క్రాంతి, సుజయ్ కుమార్, ప్రవీణ్, ఎస్ఈ సామ్యూల్, దాసరి సుందర్, మోహన్ పాల్గొన్నారు.

● జడ్చర్ల : పట్టణంలోని ఎంబీ చర్చిలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. బాదేపల్లి మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, క్రైస్తవులతో కలిసి కేక్ కట్ చేశారు.



క్రిస్టియన్‌పల్లి చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

మహబూబ్‌నగర్ తిర్పూర్‌గా అభివృద్ధి చెందాలి

పాలమూరు : భవిష్యత్తులో మహబూబ్‌నగర్ తిర్పూర్‌గా అభివృద్ధి చెందేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలి. ఈ రోజు మొదటి అడుగు వేసిన మహిళ, రానున్న రోజుల్లో ఎన్నో గొప్ప విజయాలు సాధించాలి. మహిళలు స్వయంశక్తిపై ఎదుగుతూ ఎవరి కాళ్లపై వారు నిలబడాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేం ద్రంలోని అంబేడ్కర్ కళా భవ న్‌లో మగువ స్వశక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోహి సేవింగ్ ఎంటర్ ప్రైజెస్ సహకారంతో మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించారు. రాబోవు రోజుల్లో మహిళలకు సహకారం ఉంటుందన్నారు. సెట్విన్, మహేంద్ర, ఇన్ఫోసిస్ సంస్థలతో యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించే బాధ్యత తీసుకుంటా నన్నారు. ఇప్పటికే యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుని, రూ.64 కోట్లతో ఐటీఐ కళాశాలను ఏటీసీ సెంటర్‌గా అభివృద్ధి చేసుకుని ఆరు కోర్సులు ప్రారంభించామన్నారు. ఇందులో 170 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారని గుర్తు చేశారు. అనంతరం ఎంబ్రాయిడర్ మిషన్‌ను ఆవిష్కరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, సంస్థ ప్రతినిధులు సంధ్య, సింధు, శిరీష, కిరణ్, బాలమణి పాల్గొన్నారు.

జాతర మైదానంలో చెత్తాచెదారం తొలగింపు



కురుమూర్తి జాతరలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేసిన దృశ్యం

చిన్నచింతకుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు నెల రోజుల పాటు వైభవంగా జరిగాయి. వేల సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతరలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇదే విషయాన్ని ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో కురుమూర్తి జాతరలో పారిశుధ్య లోపం అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో ఎట్టకేలకు ఆలయ అధికారులు, పాలకవర్గం సభ్యులు స్పందించారు. ఆదివారం జాతర మైదానంలో చెత్తాచెదారాన్ని తొలగించారు.

బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు పట్టణంలోని అన్నీ వార్డుల్లో బూత్ కమిటీ అధ్యక్షులను ఎంపిక చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆయా వార్డు శక్తి కేంద్రాల ఇన్‌చార్జి లను కోరారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 47వ వార్డు శక్తి కేంద్రం ఇన్‌చార్జి దర్పల్లి హరికృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై, 47వ వార్డు బూత్ అధ్యక్షుడిగా ఎంపికైన ఆవుల నర్సింహులుకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్, ఎన్నికైన సభ్యులు అంబదాస్, కామర్తి రాజు, బోయ నర్సింహ, ప్రదీప్ ఉన్నారు.

సమస్యల్లో ఏవీఆర్ కాలనీ

»» కర్వెన రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయిన తండావాసులు

»» సమస్యలను పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఏవీఆర్ కాలనీ



ఓ ఇంట్లో కొనసాగుతున్న సర్కారు బడి

భూత్పూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆ తండావాసులు రిజర్వాయర్ నిర్మాణం కోసం వారి భూములు, ఇళ్లను సైతం త్యాగం చేశారు. పునరావాసం ఏర్పాటు చేసుకొని ఏదో తోచిన కూలీపని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో మీకు అండగా ఉంటూ.. అన్ని సమస్యలు తీరుస్తామని భరోసా ఇచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక గాలికి వదిలేశారు. దీంతో వారి సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక పలు సమస్యలతో ఆ తండావాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భూత్పూర్ మండల పరిధిలో భట్టుపల్లి తండా ఉండగా, ప్రభుత్వం (కురుమూర్తి రిజర్వాయర్) చేపట్టాలని నిర్ణయించగా, 2017లో వారు తమ భూములు, ఇళ్లను త్యాగం చేశారు. పునరావాసం కింద భట్టుపల్లి తండావాసులు ఏవీఆర్ కాలనీగా మండలంలోని వెల్కిచర్ల గ్రామ శివారులో 85 ఇళ్లను నిర్మించుకొని జీవిస్తున్నారు. పూర్వ తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉండేది. నూతనంగా ఏర్పాటు చేసుకున్న తండా (ఏవీఆర్ కాలనీ)లో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి వసతులు లేవు. దీంతో నిర్మాణంలో ఉన్న ఇంట్లో పాఠశాలను నిర్వహించడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. ఓ ప్రైవేటు అద్దె భవనంలో అరకొర వసతులతో అంగన్‌వాడీ భవనం కొనసాగుతుంది. మురుగు నీరు బయటికి వెళ్లే మార్గం లేక నాగకర్నూల్ రోడ్డు మీద పారడంతో వాహనాలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుంది. గత ఏడాది క్రితం నూతన పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించడంతో తమ సమస్యలు తీరుతాయని ఆశ పడ్డారు. కానీ ఇంత వరకు ఆ దిశగా ప్రయత్నం చేపట్టకపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మా తండాలో మౌలిక వసతులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. తండాలో కొన్ని ఇళ్లకు తాగునీరు సరఫరా కావడం లేదు. ఇదే విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వివరిస్తే పైపులైన్ ఏర్పాటు కోసం రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేయించినా, ఇప్పటి వరకు అధికారులు నిధులు విడుదల చేయడం లేదు.

ఆంజనేయులు, మాజీ సర్పంచ్

దోమలతో జ్వరాలు..



మౌలిక వసతులు లేకపోవడంతో రోడ్డుపై మురుగు నీరు పారుతోంది. దీంతో దోమలు బెడద ఎక్కువై విష జ్వరాలు వస్తున్నాయి. పిల్లలు చదువుకోవడానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- సుగుణ, ఏవీఆర్ కాలనీ

వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న పోలీస్ అధికారులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత జి వెంకటస్వామి (కాకా) వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జోగులాంబ గద్వాల డీఐజీ కార్యాలయం వద్ద పోలీసులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళిర్పించి, మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వెంకటస్వామి తన జీవితకాలం ప్రజాసేవకు అంకితమై పనిచేశారన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, ఎంటీఆర్ఐ నగేశ్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో..

మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ ఎంపీగా, కేంద్రమంత్రిగా కార్మిక సమస్యలపై పోరాడి వారి సంక్షేమానికి పాటుపడ్డారన్నారు.

● మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్డీవో నవీన్, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ, కలెక్టరేట్ ఏవో శంకర్, డీపీఆర్వో శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ అర్బన్ డీటీ దేవేందర్ పాల్గొన్నారు.

● భూత్పూర్ : కేంద్ర మాజీ మంత్రి వెంకట్‌స్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం తహసీల్దార్ రహమాన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్ఐలు వెంకటేష్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మచ్చేందర్ వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నసీర్ బాగ్, విక్రమ్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్

జడ్చర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ అని ఏఎస్పీ రాములు అన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఎస్పీ జానకి ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి జడ్చర్లలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ నేరాల నివారణకు ఈ తరహా తనిఖీలు ఎంతో అవసరం అని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. న్యాయపరమైన పత్రాలు, రవాణా నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. సరైన పత్రాలు లేని 33 బైక్‌లు, ఒక కారు, ఒక ఆటోను పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడమే కాకుండా నేర ప్రవృత్తులను అదుపులో ఉంచడానికి కార్డెన్ సర్చ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, టూటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఆర్ఐ ఎంటీవో కృష్ణయ్య, మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ పాల్గొన్నారు.

యువత దైవమార్గంలో నడవాలి



మన్యంకొండకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యువత పాశ్చాత్య పోకడలను వీడి దైవమార్గంలో పయనించాలని స్వర లహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు ఎన్ భాగన్నగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్వర లహరి కల్చరల్ అకాడమీ, ధర్మ వాహిని పరిషత్ ఆధ్వర్యంలో సంయుక్తంగా 'పదరా పోదాం మన్యంకొండ'కు రెండో పాదయాత్ర కార్యక్రమాన్ని పట్టణంలోని రుక్మిణి పాండురంగ స్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. ఈ పాదయాత్ర వన్‌టౌన్ చౌరస్తా మీదుగా, హనుమాన్‌పుర, బండమీదిపల్లి, రాజీవ్ గృహకల్ప మీదుగా మన్యంకొండకు బయలు దేరారు. హనుమాన్‌పుర వద్ద కాలనీ ప్రజలు పాదయాత్ర బృందంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండమీదిపల్లి శివాజీ విగ్రహం వద్ద పూలమాల వేసి, మాట్లాడారు. తీరుతే తిరుపతి, లేకుంటే మన్యంకొండకు వెళ్లాలని పెద్దలు అనే వారని.. అంతటి ప్రసిద్ధ ఆలయమైన మన్యంకొండ వేంకటేశ్వరుడు కలియుగ ప్రత్యక్ష దైవం మనకు సమీపంలో ఉండటం అదృష్టం అన్నారు. నడవలేని వారు నేరుగా అలివేలు మంగమ్మ ప్రాంగణానికి చేరుకుంటారని, అక్కడ నుంచి అందరు స్వామి వారిని దర్శించుకుని తిరిగి వాహనాల్లో పాలమూరుకు చేరుకుంటామన్నారు. పాదయాత్రకు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనయ్య సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు. పాదయాత్రలో జోషి సంతోషాచారి, మేకల శ్రీనివాస్, కనికే శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

'సమ్మెకు సిద్ధం కావాలి'

జడ్చర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మునిసిపల్ కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ యూనియన్ మునిసిపల్ కార్మికుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణ తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్మికులు ఆదివారం తెల్లవారుజామున నిరసన వ్యక్తం చేశారు. శనివారం న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్తుంటే కొందరు కార్మికులను ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించిందని, అందులో భాగంగానే రాష్ట్ర కార్మిక నాయకుల పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అధ్యక్షుడు మహేష్, నాయకులు కేశవులు, అరుణ్‌కుమార్, దేవల్లి రాజు, అంజమ్మ, దేవమ్మ, శ్యామల, నాగమ్మ, యాదమ్మ, స్వరూప, భీమమ్మ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించి, తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ టౌన్‌హాల్‌లో ఆశ వర్కర్ల బహిరంగ సభ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లా నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఆ సభలో ఆయన మాట్లాడుతూ జీపుజాతా పర్యటన రాష్ట్ర వ్యాప్తంగా ముగిసే లోపు ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లు కనీస వేతనం రూ.18 వేలు అడుగుతున్నా అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆశ వర్కర్లకు సాధారణ సెలవులు ప్రకటించి, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. జాతరథసారథి జయలక్ష్మి, రాష్ట్ర నాయకుడు రాములు, జిల్లా నాయకులు కురుమూర్తి, చంద్రకాంత్, బాలమణి, యాదమ్మ, సావిత్రి, సునిత, భాగ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మహ్మదాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మండలంలోని ధర్మాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం ధర్మాపూర్‌కు చెందిన కావలి వెంకటేష్ (33) శనివారం చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫిర్యాదు చేయగా, సీఐ గాంధీనాయక్, డాగ్‌స్క్వాడ్‌తో ఆదివారం ఉదయం వరకు వెతికినా లాభం లేకపోయింది. ఆదివారం సాయంత్రం మల్కచెరువులో శవమై తేలాడు. మృతుడికి తల్లి, భార్య, కుమారుడు ఉన్నారు.

మహాపడి పూజను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న అయ్యప్ప సేవా సమాజం సభ్యుడు భగవంతురావు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప కొండపై బుధవారం 27వ వార్షిక మహాపడి పూజను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు భగవంతురావు అన్నారు. ఆదివారం పద్మావతి కాలనీ సమీపంలోని అయ్యప్ప కొండపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం ప్రభాత సేవ, గణపతి హోమం, అయ్యప్ప స్వాములచే రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం సాయంత్రం తూర్పు కమాన్ నుంచి కళశ పూజ, అయ్యప్ప పల్లకీ సేవ, అనంతరం ఊరేగింపు రాంమందిర్ చౌరస్తా, గడియారం చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా, పాత కలెక్టరేట్, ఎల్లమ్మ గుడి, న్యూటౌన్ చౌరస్తాల మీదుగా అయ్యప్ప కొండకు చేరుకుంటుందన్నారు. కొండపైకి చేరుకున్న అయ్యప్పకు రాత్రి 11 గంటల వరకు పూలాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ పూజా కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఏపీ జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, పి.చంద్రశేఖర్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతారన్నారు. సమావేశంలో సేవా సమాజం కార్యదర్శి ముత్యం స్వామి, సంయుక్త కార్యదర్శి పంభస్వామి, మల్యాద్రి రెడ్డి, జగదీశ్వర్, వెంకటేష్, విజయకుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, కేశవులు, రవి, ప్రేమ్‌రాజ్, సంతోష్, దత్తుస్వామి, అశోక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకోవడమే లక్ష్యం



శాస్త్రవేత్త గ్రీష్మారెడ్డి దంపతులను సత్కరిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్/ పాలమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో పంటల చీడపీడ నివారణ కోసం శాస్త్రీయమైన పరిశోధనలు చేసి అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యమని జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్త గ్రీష్మారెడ్డి అన్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ నిర్వహించిన అర్హత పరీక్షలో ఆమె ప్రతిభ చాటి జాతీయ శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. కోయిలకొండ మండలం వింజమూరుకు చెందిన ఈమె తల్లిదండ్రులు పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఉంటున్నారు. ఆదివారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ వారి ఇంటికెళ్లి గ్రీష్మారెడ్డి దంపతులను సత్కరించారు. గ్రీష్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో జరిపే పరిశోధనల ద్వారా రైతులకు మేలు చేయడమే తన లక్ష్యమని, తన విజయానికి తల్లిదండ్రులతో పాటు భర్త అఖిల్‌రెడ్డి సహకరించారన్నారు. అదే విధంగా పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గ్రీష్మారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అలీ, నాయకులు ఇంద్రసేనారెడ్డి, రాజేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గ్రీష్మ తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.